పెన్షన్ కోసం అవస్థలు

- చంద్రబాబు కుట్రల వల్లే ఈ పరిస్థితని పింఛన్‌దారుల మండిపాటు
- మాకెందుకీ ఇబ్బందులని అవ్వాతాతల ఆవేదన



51వ వార్డు 289 వుడా కాలనీ సచివాలయం వద్ద పెన్షన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు



53వ వార్డు 295 గ్రీన్‌గార్డెన్స్ సచివాలయం వద్ద నిల్చుని పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులు

మద్రిపాలెం/సీతంపేట/తాటిచెట్లపాలెం: ఐదేళ్ల నుంచి ఇంటి ముంగిటే పెన్షన్ తీసుకునే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితర లబ్ధిదారులకు టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రల వల్ల లైన్‌లో నిలబడి పింఛన్ అందుకునే దుస్థితి ఏర్పడింది. ఐదేళ్లలో లేని కష్టం ఇప్పుడు పడుతున్నామని చంద్రబాబుకు పింఛన్‌దారులు శాపనార్థాలు పెడుతున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయంతో పోటీ పడుతూ, కోడి కూయకముందే వలంటీర్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి నగదును అందించేవారు. అలాంటిది వారిని విధుల నుంచి తొలగించి, వారిపై కేసులు పెట్టించి ప్రజలు ఇబ్బంది పడేలా చేయడం దారుణమని పలువురు వాపోతున్నారు. అధికారం రాకుండానే చంద్రబాబు దిగిపోవాలని, రాకూడదని మండిపడుతున్నారు. ఈ క్రమంలో జీవీఎంసీ 49, 51, 53 వార్డుల్లోని కొన్ని సచివాలయాల్లో సాయంత్రం కొంతమంది లబ్ధిదారులకు పింఛన్ అందించారు. కొన్ని చోట్ల సచివాలయాలు మూడో అంతస్తులో ఉండటం వల్ల లబ్ధిదారుల సౌకర్యం కోసం సచివాలయ సిబ్బంది కిందకి వచ్చి పింఛన్లు అందజేశారు. ఈ సచివాలయాల్లో 50 శాతం వరకు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. లైన్‌లో నిల్చుని పింఛన్ సొమ్ము అందుకున్న వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు.

సచివాలయాల వద్ద నిరీక్షణ

వార్డు వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయడానికి వీల్లేదని చంద్రబాబు కుట్ర రాజకీయాలతో రెండు రోజుల తర్వాత సచివాలయాల్లో ప్రారంభమైన పింఛన్ల పంపిణీ అవ్వాతాతలను ఇబ్బందుల పాలు చేసింది. జీవీఎంసీ 43వ వార్డు సచివాలయాల్లో బుధవారం సాయంత్రం 5 గంటల తర్వాత పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. దీంతో ఉదయం నుంచి పింఛన్ కోసం లబ్ధిదారులు సచివాలయాల వద్ద నిరీక్షిస్తూ కన్పించారు. ముఖ్యంగా అబిద్‌నగర్-2(249) సచివాలయంలో ఉదయం నుంచి పడిగాపులు కాశారు. సాయంత్రం 4 గంటలైనా పింఛన్ పంపిణీ ప్రారంభం కాకపోవడంతో ఉసూరు మంటూ కొంతమంది వెనుతిరిగారు. సాయంత్రం 5 గంటల నుంచి 6.30 వరకు 60 మందికి పెన్షన్లు అందించారు. సచివాలయం పరిధిలో ఉన్న లబ్ధిదారులు కొంతమంది కూలి పనిచేసే వారు కావడంతో బుధవారం పనికి వెళ్లకపోవడం వల్ల రూ.800 కూలి పోయిందని, రేపు కూడా పింఛన్ కోసం సచివాలయానికి వస్తే మరో రోజు కూలి పోతుందని కన్నీరు పెట్టుకున్నారు. దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో గల మూడు సచివాలయాలు మొదటి అంతస్తులో ఉండటం వల్ల మెట్లు ఎక్కడానికి వృద్ధులు ఇబ్బంది పడ్డారు. వేరే మనిషి సాయంతో కష్టంగా మెట్లు ఎక్కి పింఛన్ అందుకున్నారు.



అబిద్‌నగర్-2(249) సచివాలయంలో పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు



దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలోని సచివాలయానికి మనిషి సాయంతో మెట్లు ఎక్కుతున్న వృద్ధురాలు



ఇద్దరు మహిళల సాయంతో పింఛన్ కోసం సచివాలయానికి వస్తున్న లబ్ధిదారు

ఈ వయసులో మాకు ఇక్కట్లు



చంద్రబాబు చేసిన కుట్రకు మేము ఇబ్బందులు పడుతున్నాం. సేవలు అందిస్తున్న వలంటీర్లను అనవసరంగా తొలగించారు. ఇబ్బంది లేకుండా పెన్షన్ వచ్చేది. ఇప్పుడు లైనులో నిలబడి తీసుకోవాల్సిన కర్మ దాపురించింది. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనే రావాలి. చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పాలి. ఈ ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో అన్నీ సక్రమంగా జరిగాయి. ఇంటింటికీ తెచ్చి మరీ పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడు మళ్లీ పడిగాపులు కాస్తున్నాం. చంద్రబాబు అధికారం కోసం అలా చేస్తున్నాడు. మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాడు.

– రాజునాయుడు, కళింగనగర్, 51వ వార్డు

ఇంకా అందని పింఛన్



ఈ నెల ఇంకా పింఛన్ రాలేదు. ఒకటో తేదీ నుంచి పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నాం. ఈ నెల నుంచి వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్లు ఇవ్వరని అంటున్నారు. మేమెలా బయటకు వెళ్లాలో తెలియడం లేదు. ఎప్పుడూ ఒకటో తారీఖునే కాలు బయట పెట్టకుండా మా ఇంటికి తీసుకొచ్చి పింఛన్ డబ్బులు చేతిలో పెట్టి వలంటీర్లు మా శ్రమ తగ్గించారు. ఇప్పుడు ఉన్నట్టుండి ఇలా ఇబ్బంది పెడుతున్నారు.

– సూర్యనారాయణ, చిట్టిబాబు కాలనీ, 45వ వార్డు

వలంటీర్లను అడ్డుకోవడం దారుణం



గతంలో ఏ నాయకులు పింఛన్లు మా ఇంటి వద్దకే పంపించిన వారు లేరు. సీఎంగా జగన్ బాబు వచ్చి వలంటీర్ల ద్వారా పింఛన్లు అందిస్తున్నారు. ప్రతి నెలా తెల్లారక ముందే మా ఇంటికి పింఛన్లు తీసుకొచ్చేవారు. ఈ నెల ఇంకా పింఛన్ అందలేదు. వలంటీర్లు చాలా బాగా సేవలు అందించారు. చంద్రబాబు వలంటీర్లను అడ్డుకోవడం దారుణం. పింఛన్ కోసం మళ్లీ ఆఫీసుల చుట్టూ మాలాంటి వాళ్లం తిరగలేము.

– ఆవుల వీరమ్మ, ఏఎస్సార్ నగర్, 45 వార్డు

మెడికల్ క్యాంప్ పేరుతో కోడ్ ఉల్లంఘన

మద్రిపాలెం: టీడీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గీతం యూనివర్సిటీ అధినేత శ్రీభరత్ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారంటూ పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరికి కోడ్ వర్తించదా.. అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. గీతం జింసర్ కాలేజీ ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ 50వ వార్డు తెన్నేటినగర్‌లో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ విధంగా ఎన్నికల ప్రచారం చేస్తూ ప్రజలను ప్రభావితం చేస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య సురక్ష ద్వారా ప్రభుత్వం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా సేవలు అందిస్తూ, మందులు పంపిణీ చేస్తున్న క్రమంలో వీరు ఇలా మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయడం పలు అనుమానాలకు తావిస్తోందంటున్నారు. ఇలా అడ్డదారుల్లో ప్రచారాలు నిర్వహించి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న గీతం(జింసర్) వైద్యులు

హెచ్‌ఎస్‌ఎల్‌ను సందర్శించిన ఈఎన్‌సీ చీఫ్



షిప్‌యార్డ్‌లో చేపట్టిన పలు ప్రాజెక్ట్‌లను వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌కు వివరిస్తున్న షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి

సింధియా: ఈస్ట్రన్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ బుధవారం హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌ను సందర్శించారు. ఇందులో భాగంగా షిప్‌యార్డ్‌లో జరుగుతున్న విస్తరణ పనులతో పాటు భవిష్యత్తు ఓడ నిర్మాణ ప్రాజెక్ట్‌లు, వాటి మరమ్మతులు, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను షిప్‌యార్డ్ అధికారులు వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌కు వివరించారు. అనంతరం ఇండియన్ నేవీ కోసం నిర్మిస్తున్న డైవింగ్ సోర్ట్ వెసెల్‌ను కూడా సందర్శించారు.

అలరించిన కవి సమ్మేళనం

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అందరినీ అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ అసలైన కవిత్వం ప్రజా సమస్యలు, కన్నీళ్లకు పరిష్కారం చూపిస్తుందన్నారు. డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ ప్రముఖ కవి, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సినీ కవి గుల్జార్ గురించి పరిచయం చేశారు. ఎస్.విజయ్‌కుమార్, దామరాజు విశాలాక్షి, కె.వి.ఎస్.మూర్తి, రామతాత, కె.రాంప్రసాద్, జి.కె.సుబ్రహ్మణ్యం, సిహెచ్.చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, వేదుల కామేశ్వరశర్మ తదితరులు స్వీయ కవిత్వం చదివి వినిపించారు.



కవిత్వం వినిపిస్తున్న కె.వి.ఎస్.మూర్తి

వివాహిత బలవన్మరణం




భర్త, కుమార్తెలతో సౌజన్య(ఫైల్)

గోపాలపట్నం: సీతారామరాజు నగర్‌లో ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడి ఘటన జరిగింది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్‌ఈబీ కాలనీ సమీపంలోని సీతారామరాజు నగర్‌లో గల వీకేఆర్కేడ్ అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులో గోపిదైల సౌజన్య(33), భర్త రామకృష్ణ, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తోంది. మంగళవారం రాత్రి భర్త, పిల్లలతో కలిసి బెడ్ రూమ్‌లో నిద్రించింది. మధ్య రాత్రి సమయంలో హాల్‌లోకి వచ్చి ఫ్యాన్‌కు చున్ని కట్టి ఉరి వేసుకుంది. పెద్ద కుమార్తె ఇషిత చూసి తండ్రికి తెలియజేసింది. ఆమెను కిందకి దించి 100కు డయల్ చేసి భర్త సమాచారమిచ్చారు. టీపీటీ కాలనీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో రామకృష్ణ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఇషిత(13), రితిక(10) ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు, ఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మానసిక ఆందోళన కారణంగా ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి బాబూరావు చెబుతున్నాడు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన ఎయిర్‌పోర్ట్ పోలీసులు సౌజన్య మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

మిద్దె పంటలతో పర్యావరణ పరిరక్షణ

మురళీనగర్: మిద్దె పంటల ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని వైజాగ్ గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మురళీనగర్‌లో మిద్దె పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ ప్రాంతాల్లో మొక్కలను పెంచాలన్నారు. కూరగాయల విత్తనాలను మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి, ఉపాధ్యక్షురాలు సీహెచ్ వరలక్ష్మి, కోశాధికారి పి.కమల, పూర్వ అధ్యక్షురాలు ఎం.శేషామణి, కె.మాధవి, డి.శిరీష, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ జి.మహాలక్ష్మి, కె.సుగుణ, కోమలి, జ్యోతి, అధిక సంఖ్యలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

దేవదాయ శాఖ భూముల పరిరక్షణకు చర్యలు

మధురవాడ: దేవదాయ శాఖ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్న ఆ శాఖ కమిషనర్ సత్యనారాయణ చెప్పారు. బుధవారం ఆయన అధికారులతో కలసి మధురవాడ జోనల్ కార్యాలయం సమీపంలోని సర్వే నంబర్ 12లో గల భూములు, అందులోని ఆక్రమణలు పరిశీలించారు. ఇక్కడ ఉన్న సుమారు 18 ఎకరాలతో పాటు ఇతర భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ శిరీష, డిప్యూటీ కమిషనర్ సుజాత ఉన్నారు.

క్లుప్తంగా

వాకర్స్‌తో కె.కె.రాజు ముచ్చట్లు



స్పీపర్ పార్కులో వాకర్స్‌తో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతంపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఉదయం 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని స్పీపర్ పార్కును వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సందర్శించారు. పార్కుకు వచ్చిన వాకర్స్‌తో కాసేపు ముచ్చటించారు. సీతమ్మధారలో నిర్వహించిన అభివృద్ధి పనులను వివరించారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాల బ్రోచర్లు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వాకర్స్‌ను ఆయన కోరారు. కార్యక్రమంలో హరివర్మ, అసోసియేషన్ పెద్దలు పాల్గొన్నారు.

కె.కె.రాజుకు క్రిస్టియన్ల మద్దతు



కె.కె.రాజును సత్కరిస్తున్న క్రిస్టియన్లు

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు క్రిస్టియన్లు మద్దతు తెలిపారు. రెవరెండ్ విక్టర్‌పాల్ ఆధ్వర్యంలో క్రైస్తవ మత బోధకులు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం కె.కె.రాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కె.కె.రాజు గెలుపునకు కృషి చేస్తామన్నారు.

బాలుడి అదృశ్యం



సురుపిల్లి రాకేష్

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలుడు అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం మెట్టు నూకాలమ్మ గుడి వద్ద తల్లి జ్యోతి, అన్నదమ్ములతో కలిసి సురుపిల్లి రాకేష్ నివసిస్తున్నాడు. 10వ తరగతి చదివి ప్రస్తుతం డ్రమ్స్ వాయిస్తున్నాడు. గత నెల 29వ తేదీ రాత్రి 7.30 సమయంలో ప్రోగ్రాం ఉందని చెప్పి వెళ్లిన రాకేష్ తిరిగి ఇంటికి రాకపోవడంతో అంతటా వెతికినా ఆచూకీ తెలియలేదు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ రావడంతో మంగళవారం రాత్రి బాలుడి తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేస్ నమోదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు. రాకేష్ వివరాలు తెలిసినవారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఉగాది, శ్రీరామనవమి వేడుకల కరపత్రికావిష్కరణ



కరపత్రికను ఆవిష్కరిస్తున్న షిర్డీసాయి ధ్యాన మందిర కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ఈ నెలలో జరిగే ఉగాది, శ్రీరామనవమి వేడుకల కరపత్రికను బుధవారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ నెల 9న ఉగాది పర్వదినం సందర్భంగా ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని, ఈ నెల 17వ తేదీ శ్రీరామనవమి వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు తెలిపారు.

తోక పార్టీలన్నీ కలిసొచ్చినా..

విజయం మాదే



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

- గర్వంగా ఓటడిగే హక్కు కల్పించిన సీఎం వైఎస్ జగన్
- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతంపేట: తోక పార్టీలన్నీ కలిసి ఉమ్మడిగా పోటీ చేస్తే.. వైఎస్సార్‌సీపీ సింగిల్‌గా పోటీ చేస్తోందని, ఏకపక్షంగా ఓట్లు సాధించి విజయకేతనం ఎగురవేస్తామని ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 44వ వార్డు 80 ఫీట్ రోడ్డులో కార్పొరేటర్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వార్డు ఎన్నికల కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమావేశంలో కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పది నెలల కాలంలో ప్రజలే తన కుటుంబ సభ్యులుగా భావించి సంక్షేమ పథకాలకు పెద్దపీట వేశారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని, వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని చెప్పారు.

పేదలకు చేరువైన విద్య, వైద్యం

గత టీడీపీ ప్రభుత్వం విద్యను వ్యాపారం చేసిందని, అకాడమీల పేరుతో దోచుకున్నారని కె.కె.రాజు ఆరోపించారు. సమాజంలో విద్యతోనే గౌరవం, ఉన్నతి లభిస్తాయని భావించిన సీఎం జగన్ ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన, గోరు ముద్ద, వసతి దీవెన, విదేశీ విద్య ఇలా అనేక సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను చేరువ చేశారన్నారు. ఆరోగ్యశ్రీ పథకంతో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రూ.5 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారికి కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందేలా చూశారని, ఇపుడు ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచి ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా కల్పించారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులతో గడప గడపకూ వెళ్లి ఓట్లు అడిగే హక్కు కల్పించారన్నారు. కార్యకర్తలు గర్వంగా ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీకి ఓటేయమని అభ్యర్థించాలని సూచించారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, బాణాల తరుణ్, 44వ వార్డు సీనియర్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



44వ వార్డు ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు

రైల్వే న్యూకాలనీలో ఎన్నికల కార్యాలయం ప్రారంభం

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని పాలాక్స్ స్కూల్ వీధిలో వార్డు ఎన్నికల కార్యాలయాన్ని బుధవారం కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికలు ముగిసే వరకు వార్డుకు సంబంధించిన బూత్ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యాలయ సేవలను వినియోగించుకోవచ్చని ఆళ్ల లీలావతి తెలిపారు. అనంతరం వార్డులోని పలు ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆళ్ల శ్రీనివాసరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్, దక్షిణ నియోజకవర్గ వార్డు ఇన్‌చార్జి ఎస్.ప్రసాదరావు, డైరెక్టర్ నాగమణి, కో ఆప్షన్ సభ్యుడు షరీఫ్, ఎన్నికల పరిశీలకుడు రాజు పాత్రుడు, కో ఆర్డినేటర్ హరీష్, రమణమూర్తి, సబ్బి నూకరాజు, కృష్ణవేణి, కనకమహాలక్ష్మి, జయ, గౌరి, పావని, దుర్గ, రత్నం తదితరులు పాల్గొన్నారు.



42వ వార్డు ఎన్నికల కార్యాలయ ప్రారంభంలో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, శ్రీనివాస్ తదితరులు

45, 55 వార్డుల్లో అదనపు కమిషనర్ పర్యటన

కంచరపాలెం: జోన్-5 పరిధిలోని 45, 55 వార్డుల్లో బుధవారం జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పర్యటించారు. 45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లోని టిడ్కో గృహ సముదాయాలను ఆయన పరిశీలించారు. కాలనీలో మౌలిక సదుపాయాలు సక్రమంగా అందేటట్లు చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వార్డులోని సచివాలయాల్లో పింఛన్ల పంపిణీకి సంబంధించి లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఏపీడీ అధికారులకు సూచించారు. 55వ వార్డు ధర్మానగర్, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఏసీ విశ్వనాథన్ పరిశీలించారు. పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఎస్ఈ వేణుగోపాల్, ఈఈ మత్స్యరాజు, ఏసీపీ రామకృష్ణ, టీపీవో విజయకుమార్, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీ పద్మావతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యు.కార్తీక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్ల వద్ద పరిశీలిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్

పేదలకు అన్నదానం

మురళీనగర్: మురళీనగర్ శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పురస్కార్ ట్రస్టు వార్షికోత్సవం సందర్భంగా పేదలు, నిరాశ్రయులకు బుధవారం అన్నదానం నిర్వహించారు. మురళీనగర్ శ్రీదేవి పార్కులో ట్రస్టు చైర్‌పర్సన్ కుప్పిలి కీర్తి పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 120 మంది పేదలు, మున్సిపల్ కార్మికులు, ఇతర నిరాశ్రయులకు మధ్యాహ్న భోజనం అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



పేదలకు అన్నం వడ్డిస్తున్న కీర్తి పట్నాయక్

ఏఆర్‌సీకి ఎలుగుబంటి తరలింపు

ఆరిలోవ: శ్రీకాకుళం జిల్లా అడవుల్లో సంచరిస్తూ అటవీ అధికారులకు చిక్కిన ఎలుగుబంటిని విశాఖ జంతు పునరావాస కేంద్రాని(ఏఆర్‌సీ)కి తరలించారు. జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపిన వివరాలు ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా అడవుల నుంచి మంగళవారం ఉదయం జనారణ్యంలోకి వచ్చిన ఓ ఎలుగుబంటి వజ్రపు కొత్తూరు మండలం మెట్టూరులో పాడుబడిన ఇంట్లోకి చేరింది. శ్రీకాకుళం అటవీ డివిజన్ అధికారులు, విశాఖ జూ రెస్క్యూ టీం సమన్వయంతో దాన్ని చాకచక్యంగా పట్టుకున్నారు.

జూ వైద్యులు ఆ ఎలుగుబంటికి అక్కడే ప్రాథమిక పరీక్షలు చేసి శరీరంపై కొన్నిచోట్ల గాయాలున్నట్లు గుర్తించారు. అనంతరం అక్కడి నుంచి మంగళవారం రాత్రి 11 గంటలకు విశాఖలో ఏఆర్‌సీకి తీసుకొచ్చారు. ఎలుగుబంటికి శారీరక, మానసిక ఆరోగ్యం కోసం తగిన చికిత్స, ఆహారం అందిస్తున్నారు.

నేడు మొదటి విడత ర్యాండమైజేషన్

మహారాణిపేట: ఎన్నికల్లో పాల్గొనే పోలింగ్ అధికారులకు గురువారం మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. ప్రీసైడింగ్ అధికారులు, సహాయ ప్రీసైడింగ్ అధికారులను నిర్ణయించనున్నట్లు వెల్లడించారు. వీరందరికీ మొదటి విడత శిక్షణను ఈ నెల 10 నుంచి నిర్వహిస్తామన్నారు. ఏ ఉద్యోగికీ ఇందులో మినహాయింపు లేదని.. ఎవరైనా గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

నియోజకవర్గం	శిక్షణ కేంద్రం	శిక్షణ తేదీ
భీమిలి	ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ, సంగివలస	10, 12
విశాఖ తూర్పు	ఏయూ సివిల్ ఇంజినీరింగ్ క్లాస్ రూమ్	10, 12
విశాఖ దక్షిణ	ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, జైల్ రోడ్	10
విశాఖ ఉత్తర	ఏయూ మెయిన్ ఇంజినీరింగ్ బ్లాక్	10, 12
విశాఖ పశ్చిమ	ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ బ్లాక్	10, 12
గాజువాక	టీఎస్సార్ అండ్ టీబీకే డిగ్రీ కాలేజీ, శ్రీనగర్, గాజువాక	10, 12
పెందుర్తి	పెందుర్తి గవర్నమెంట్ హైస్కూల్	10, 12